## క్లుప్తంగా

### నేటి నుంచి సముద్రంలో వేట నిషేధం

**తొండంగి:** సముద్రంలో మత్స్యసంపద పెరిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వేట నిషేధం ఆదివారం నుంచి అమలులోకి వస్తుందని తుని మత్స్యశాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. నాటు పడవలు మినహా మెకనైజ్డ్, మోటార్ బోట్లపై మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ల రాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 13 వరకూ వేట నిషేధం అమలులో ఉంటుందన్నారు. మత్స్యకారులు వేట నిషేధం అమలుకు సహకరించాలని కోరారు.

### హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

**ఏలేశ్వరం:** పట్టణంలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు రెండోరోజు శనివారం హోరాహోరీగా సాగాయి. స్థానిక కంబాలపాలెం కాలనీలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ వాలీబాల్ టోర్నీలో 24 జట్లు పాల్గొన్నాయి. పోటీలు రసవత్తరంగా సాగడంతో స్థానికులు ఆసక్తిగా వీక్షిస్తున్నారు. అంబేడ్కర్ జయంతిరోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కుప్పల కాశీ, గుమ్మాల రాంబాబు, నీలపల్లి నాగు, పిల్లా రవి, కండెల్లి రాజు, దుండి శ్రీను, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


### పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న కృష్ణ

**ప్రత్తిపాడు:** గ్రామంలోని పేద విద్యార్థులకు 'సదా మీసేవలో'.. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక బజారువీధి రామాలయం వద్ద పేద విద్యార్థులకు అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ అవార్డు గ్రహీత సలాది కృష్ణ పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్న ఎస్ఎంఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ సంస్థ ప్రతినిధులు జి.సత్యానందం, భేరి రాంబాబు, శిరసాల లక్ష్మి, జాజిమొగ్గల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### వేదాంత మహాసభలు ప్రారంభం



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న దివ్యానంద సరస్వతీస్వామి

**ఏలేశ్వరం:** మండలంలోని సిరిపురం చిద్గగానంద గీతాశ్రమంలో శనివారం భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు వేదాంత మహాసభలు నిర్వహించనున్నారు. మొదటిరోజు ప్రణవోపాసన, ప్రాతఃకాల ప్రార్థన, నగర సంకీర్తన, యోగానందా భారతీ స్వామి వారితో పతాకారోహణ, సూర్యనమస్కారాలు, జ్యోతిప్రజ్వలన నిర్వహించారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు ప్రార్థన చేశారు. అనంతరం గీతాపారాయణ, గీతా యజ్ఞం నిర్వహించారు. కాకినాడ గీతాశ్రమం దివ్యానంద సరస్వతీస్వామితో పాటు పలువురు స్వామీజీలు ప్రవచనాలు, భజనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు, రేపు అంతరాయం

**తొండంగి:** తుని మండలం హంసవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా తొండంగి మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం, సోమవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ రత్నాలరావు తెలిపారు. మండలంలోని గోపాలపట్నం, అన్నయ్యపేట, ఒంటిమామిడి, ఏవీ నగరం, కత్తిపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# నీటిబొట్టు.. ఒడిసి పట్టు

- పంపా ఆయకట్టు శివారు పొలాలకు అందని నీరు
- ఎండిపోతున్న పంటలు
- కాలువలో అడ్డంకులు తొలగించి నీరు పొలాలకు వెళ్లేలా చేస్తున్న రైతులు



వేమవరంలో ఎండిపోతున్న రబీ పంట



పంపా కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న రాళ్లు తొలగిస్తున్న రైతులు

**అన్నవరం:** పంపా ఆయకట్టు శివారు పొలాలకు నీరు అందకపోవడంతో వరి చేలు ఎండిపోతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా తమ పొలాలకు నీరు అందించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఓ వైపు చివర దశలో ఉన్న వరి పంట..మరో వైపు తక్కువ పరిమాణంలో విడుదలవుతున్న సాగునీరు, అది కూడా కొంతమేర ఎండకు ఆవిరైపోతుంటే మరి కొంత నీరు మార్గం మధ్యలో రాళ్లు, తుప్పలకు తగిలి పక్కదారి పడుతోంది. దీంతో తమ పంటను కాపాడుకునేందుకు రైతులే నడుం బిగించారు. పంపా కాలువల నుంచి విడుదలవుతున్న నీటిని తమ పొలాలకు తీసుకుని వెళ్లేందుకు దారి పొడవునా అడ్డంకులు తొలగిస్తున్నారు.

**రోజుకు 40 క్యూసెక్కుల నీరు విడుదల**

అన్నవరంలోని పంపా రిజర్వాయర్ కింద ఈ ఏడాది సుమారు పది వేల ఎకరాలలో రబీ సాగుకు గత డిసెంబర్‌లో ప్రభుత్వం అనుమతిచ్చింది. పంపాలో నీరు సరిపోక ఏలేరు నది నుంచి రోజుకు 20 క్యూసెక్కుల నీటి విడుదలకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు రోజు 20 క్యూసెక్కుల నీరు పంపాకు విడుదలవుతుండగా పంపా నుంచి 40 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు.

**మరో పది రోజులు**

పంపా ఆయకట్టు పరిధిలో సుమారు 9 వేల ఎకరాల్లో రబీ పంట పక్వానికి వచ్చింది. కొన్నిచోట్ల రైతులు కోతలను సైతం ప్రారంభించారు. కాలువ చివర గ్రామమైన వేమవరంలో మాత్రం ఇంకా పంట పక్వానికి రాలేదు. పంట పక్వానికి వచ్చేందుకు మరో 15 రోజులు పడుతుంది. కాగా పంపా నదిలో నీరు సైతం అడుగంటింది. ఏలేరు నుంచి విడుదలవుతున్న 20 క్యూసెక్కుల నీరు కొంత ఆవిరైపోతుంటే మరికొంత మార్గం మధ్యలో రాళ్లు, తుప్పలు అడ్డుకోవడంతో పక్కదారి పడుతోంది. ఈ పరిస్థితిని గమనించిన రైతులు స్వయంగా వారే రంగంలోకి దిగారు. గత మూడు రోజులుగా పంపా అక్విడెక్ట్ వెనుక నుంచి పంపా రిజర్వాయర్ కాలువ గేటు వరకు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న రాళ్లు, మట్టి దిబ్బలను తొలగిస్తున్నారు. పంపా మెయిన్ కెనాల్‌లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెట్లు, తుప్పలు, వ్యర్థాలను తొలగించి తమ పొలాలకు నీరు అందేలా చేస్తున్నారు. మరో పది రోజులు పంటలకు నీరందితే సరిపోతుందని పంపా ఇరిగేషన్ అసిస్టెంట్ శ్రీదేవి తెలిపారు.



పంపాకు విడుదలవుతున్న ఏలేరు నీటి మధ్యలో అడ్డంకులు తొలగిస్తున్న రైతులు

## ఘనంగా గంగాలమ్మ గావు సంబరం



రాచపల్లిలో గంగాలమ్మతల్లిని దర్శించుకుంటున్న వరుపుల సుబ్బారావు

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని రాచపల్లిలో గంగాలమ్మతల్లి గావు సంబరం శనివారం ఘనంగా జరిగింది. గంగాలమ్మతల్లి చినసారిపల్లి వారి ఇలవేల్పు కావడంతో సారిపల్లివారి కుటీంబీకులు ప్రతి మూడేళ్లకు ఒక్కసారి ఈ గాబు సంబరాన్ని వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా గావు సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సారిపల్లివారి ఆడపడుచలు, కుటింబీకులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెటగుళ్లు, సువ్వారాట ప్రదర్శనలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, గంగరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సారిపల్లి కుటుంబీకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పథకాలు అందాలంటే జగనే మళ్లీ రావాలి



తంటికొండలో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- తంటికొండలో ఎన్నికల ప్రచారం

**గోకవరం:** రాష్ట్రంలో అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని తంటికొండలో కోడలు శ్రీనిధి, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరిన్ని పథకాలు అందాలన్నా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తన భర్త తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. తొలుత గోకవరంలో గుబ్బాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దిరెడ్డి సత్యనారాయణమ్మ, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), పార్టీ నాయకులు సుంకర వీరబాబు, బద్దిరెడ్డి అప్పన్నదొర, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, నాయకులు బద్దిరెడ్డి నాగేశ్వరరావు, సమ్మెటి నాని, అక్షింతల రాజా, నరాలశెట్టి సర్వయ్య, బద్దిరెడ్డి సుబ్బారాయుడు, సోషల్ మీడియా కన్వీనర్లు ఇజ్జిన కిరణ్, అంబి ప్రసన్న, టౌన్ కన్వీనర్ వీర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- జెడ్.రాగంపేటలో ఎన్నికల ప్రచారం



జెడ్.రాగంపేట ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

**గండేపల్లి:** సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ కోరారు. మండలంలోని జెడ్. రాగంపేటలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్నివర్గాలకూ మేలు జరిగిందన్నారు. గతంలో మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవంతో తన తండ్రి తోట నరసింహం జగ్గంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జాన్ వెస్లీ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ విజయం తథ్యం



ఏలేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- ఏలేశ్వరంలో ఎన్నికల ప్రచారం

**ఏలేశ్వరం:** ప్రతిపక్ష పార్టీలు ఎన్నికుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 5, 6 వార్డుల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ప్రజలను మభ్యపెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదన్నారు. సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌కే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, వాడపల్లి శ్రీను, జువ్విన వీర్రాజు, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



భద్రవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల రాజబాబు

**భద్రవరంలో వరుపుల తనయుడు ప్రచారం**

**ఏలేశ్వరం:** వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే ప్రజలు మరోసారి పట్టం కట్టాలని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు తనయుడు రాజబాబు కోరారు. మండలంలోని భద్రవరంలో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీఎం జగన్ మళ్లీ అధికారం చేపడితే పేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, అడపా పార్థ సారథి, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, కూనపురెడ్డి దుర్గారావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## రత్నగిరికి చేరిన సత్యదేవుని ధ్వజస్తంభం కర్ర



ఆలయానికి చేరిన ధ్వజస్తంభం కర్రను పరిశీలిస్తున్న ఈఓ రామచంద్రమోహన్, అధికారులు



ధ్వజస్తంభం కర్రను గోపురం మెట్ల మీదుగా ఆలయంలోకి చేరుస్తున్న దృశ్యం

**అన్నవరం:** స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కోసం సేకరించిన 65 అడుగుల పొడవైన నారప జాతి కర్రను శనివారం సాయంత్రం రత్నగిరికి చేర్చారు. గత ఆగస్టులో ఈ కర్రను స్థానిక పంపా సత్రానికి తీసుకువచ్చి అక్కడ భద్రపరచిన విషయం విదితమే. అక్కడ నుంచి శనివారం సాయంత్రం పొక్లెయిన్, ట్రాక్టర్ సాయంతో ఘాట్ రోడ్ ద్వారా తూర్పు రాజగోపురం సమీపానికి తీసుకువచ్చారు. రాజగోపురం మెట్ల మీదుగా ఆలయంలోని అనివేటి మండపం వద్దకు ధ్వజస్తంభాన్ని తీసుకుని వెళ్లి అక్కడ ఉంచారు. ఈ ధ్వజస్తంభం కర్రను దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ పరిశీలించారు. దేవస్థానం ఈఈ నరసింహరెడ్డి, ఏఈఓ కృష్ణారావు, డీఈలు గుర్రాజు, రాంబాబు, ఉదయ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**22న ధ్వజస్తంభం ప్రతిష్ఠ**

సత్యదేవుని నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ నెల 18న ప్రారంభిస్తారు. 22న ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తారు. నెల్లూరుకు చెందిన భక్తుడి కుటుంబ సభ్యులు 130 మంది కలిసి ఈ ధ్వజస్తంభం ప్రతిష్ఠ నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠ అనంతరం దానికి స్వర్ణ రేకు తాపడం చేయనున్నారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి
- తునిలో రాజకీయ పార్టీల నాయకులతో అఖిల పక్ష సమావేశం

**తుని రూరల్:** సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి కోరారు. తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శనివారం సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో తుని పట్టణం, తుని, కోటనందూరు మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతా కుమారి మాట్లాడుతూ ఎన్నికల్లో ఏదో ఒక రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థులు గెలుస్తారని, అన్ని పార్టీలు కలసి ఎన్నికల ప్రక్రియను గెలిపించాలన్నారు. నాయకులు ఎన్నికల నియమావళి పాటించాలని, ఎలక్షన్ డ్యూటీ చేసే సిబ్బందికి సహకరించాలన్నారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. గతంలో జరిగిన హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్న 19 మందిని బైండోవర్ చేశామన్నారు. ఇటీవల వివిధ పార్టీలపై 12 కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల అనుమతులకు 48 గంటలు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి 24 గంటల్లో అనుమతులు జారీ చేస్తామన్నారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థితో ఐదుగురి మద్దతుదారులను ఈఆర్వో కార్యాలయానికి అనుమతిస్తామన్నారు. 223 పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తుని రూరల్, కోటనందూరు ఎస్సైలు రమేష్‌బాబు, శంకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి మహేష్, రవిచంద్ర, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్–ఐ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతా కుమారి

## వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ఉప్పరగూడెంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణస్వామి విగ్రహాలు



ఏలేశ్వరంలో సీతారాముల చిత్రపటాలతో భక్తులు

**కోటనందూరు:** మండలంలోని కాకరాపల్లి శివారు ఉప్పరగూడెంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గ్రామ నాయకుడు నక్కా వెంకటరమణ ఆధ్వర్యంలో వేద పండితులు హోమాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8.35 గంటలకు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, మహాగణపతి, కుమార సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఏఎంసీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, మాజీ సర్పంచ్ నక్కా ఏడుకొండలు ఉత్సవ మూర్తులను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో మధాహ్నం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

**శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి**

**ఏలేశ్వరం:** ప్రతిఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రవచనకర్త అణివెల్ల రామం సూచించారు. స్థానిక రూపులమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇంటింటా రామనామం కార్యక్రమంలో భాగంగా సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని గుణగణాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మాట తప్పని విధానం, పెద్దల పట్ల గౌరవం శ్రీరాముని ద్వారా తెలుసుకోవచ్చాన్నారు. అనంతరం హనుమాన్ చాలీసా పఠించారు. భక్తులకు సీతారాముల చిత్రపటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు కటకం కిరిటీ, ఏడీవీ ప్రసాద్, ఉడతల రమణారావు, మహిళలు పాల్గొన్నారు.

### ఇంటర్‌లో టాపర్‌కు సత్కారం



ఏలేశ్వరంలో టాపర్ వినోదినిని సత్కరిస్తున్న అధ్యాపకులు

**ఏలేశ్వరం:** ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన కొత్త వినోదిని పట్టణంలో శనివారం ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన కొత్త వినోదిని ఇంటర్‌లో 988/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. దీంతో స్థానిక భాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వినోదినిని శాలువా, పూలమాలలతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన వినోదిని రాష్ట్రస్థాయిలోఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొత్త నాగేశ్వరరావు, ప్రైమరీ హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- పాతకొట్టాంలో ఎన్నికల ప్రచారం



పాతకొట్టాంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్ మల్లిక్

**కోటనందూరు:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్ అన్నారు. మండలంలోని పాతకొట్టాంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పసగుడుగుల వరహాలు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. జగన్ మరోసారి సీఎం అయితే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, ఉప సర్పంచ్ బొంగు గోపాలకృష్ణ, ఎంపీటీసీ దొగ్గా రామకృష్ణ, ఏఎంసీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, పసగడుగుల గోపీ తదితరులు పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న మట్టి, గ్రావెల్ మాఫియా

**కోటనందూరు:** మండలంలో మట్టి, గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్లో అనధికారికంగా వందల ట్రాక్టర్ల మట్టి, గ్రావెల్ తరలించి జేబులు నింపుకుంటున్నారు. అధికారులు విధుల్లో ఉండని ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో అధికారుల కళ్లు కప్పి గుట్టుచప్పుడు కాకుండా ఇటుక బట్టీలు, లోతట్టు ప్రాంతాలు ఎత్తు చేయడానికి మట్టిని తరలిస్తున్నారు. అన్నీ తెలిసినా.. రెవెన్యూ అధికారులు మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జన జీవనానికి ఇబ్బంది కలిగిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మట్టి మాఫియా ఆగడాలపై కొరడా ఝుళిపించాలని స్థానికులు కోరుతున్నారు.

## తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడికి సన్మానం



తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నాగేంద్ర నెహ్రూను సత్కరిస్తున్న నాయకులు

**తుని:** తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సకురు నాగేంద్ర నెహ్రూను వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం నాగేంద్ర నెహ్రూ, పామర్తి మహేష్‌లను తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడు బాబు, కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనివాస్, దేవవరపు నాని, పోతుల లక్ష్మణ్, శ్రీహరిరాజు, నాగం గంగబాబు తదితరులు పూలమాల, శాలువాలతో సత్కరించారు. తుని చాంబర్ ఆఫ్ కామర్స్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.